అన్నదాతకు అడుగడుగునా కష్టాలు

- కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు, తరుగు పేరుతో ఇబ్బందులు
- అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- ధాన్యం విక్రయించి పది రోజులు అవుతున్నా ఖాతాల్లో జమకాని నగదు



అనంతారంలో కాంటాలు వేసిన ధాన్యం

పెన్‌పహాడ్ : నారు పోసిన దగ్గర నుంచి పంట విక్రయించుకునే దాక అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సిన వస్తోంది. కరెంట్ కోత, నీటి ఎద్దడి, తెగుళ్లతో తంటాలు పడి పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించినా అకాల వర్షాలు రైతులను దెబ్బతీశాయి. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో సింగారెడ్డిపాలెం, మాచారం, దూపహాడ్, భక్తాళాపురం, మహ్మదాపురం, అనాజిపురం, నారాయణగూడెం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో అనంతారం, అన్నారం, అన్నారం బ్రిడ్జి, నారాయణగూడెం, దోసపహాడ్, చీదెళ్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెన్‌పహాడ్, మాచారం, ధర్మాపురం, చీదెళ్ల, గాజులమల్కాపురం, అనిరెడ్డిగూడెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. కింది స్థాయిలో మాత్రం రైతులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ధాన్యం విక్రయించిన వారంలోగా నగదు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా నగదు జమ కావడంలోనూ జాప్యం అవుతుంది.

రైతులపై వడ్డీ భారం..

అన్నదాతలు కొందరు ఎరువుల దుకాణాదారుల వద్ద, మరికొందరు వేర్వేరు విధాలుగా అప్పులు తెచ్చి పంటలను సాగు చేశారు. పంట విక్రయించిన వెంటనే అప్పులు తీర్చుకుందామని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతోంది. 10రోజుల క్రితం లోడింగ్ చేసిన ధాన్యం నగదు సైతం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దాదాపు 20రోజులు అయినా నేటికీ రైతుకు రూపాయి కూడా చెల్లించలేదు.

కొనుగోలు కేంద్రాల్లోనూ తంటాలు..

కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. నిర్వాహకులు తేమ, తాలు, తూర్పార పట్టడం, కింటాకు కేజీ చొప్పున అధిక కాంటా అని రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అన్ని కష్టాలు తట్టుకొని పంట విక్రయించి మిల్లర్లకు తరలించినా తరుగు పేరుతో మరో రకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విక్రయించిన పంటలో ఎంత మేర తరుగుపోతుందో, ఎన్ని క్వింటాళ్లకు నగదు జమ చేస్తారో తెలియక అయోమయ స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

ధాన్యం అమ్మి 25రోజులు అవుతోంది



ధాన్యం విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద అనేక రోజులు ఇబ్బందులు పడ్డాం. చివరకు పంట విక్రయించి దాదాపు 25రోజులు అవుతున్నా నగదు జమకాలేదు. ఇప్పుడు నగదు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– గండికోట పూలమ్మ, రైతు, అనంతారం

మిల్లుల్లో జాప్యం



మిల్లుల్లో ధాన్యం తరుగు పేరిట ఎంత తీస్తారో తెలియడంలేదు. ట్రక్ షీట్‌లను తీసుకరాకపోడంతో బిల్లుల్లో జాప్యం జరిగింది. వారం రోజుల్లో ధాన్యం బిల్లులను రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– ఆలకుంట్ల సైదులు, సీఈఓ, నారాయణగూడెం

క్లుప్తంగా

ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 166వ ర్యాంక్



హేమంత్‌రెడ్డి

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన ఉప్పుల సాగర్‌రెడ్డి–కరుణ దంపతుల కుమారుడు హేమంత్‌రెడ్డి ఎంసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 166వ ర్యాంక్ సాధించారు. అతడు హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నారాయణ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదివారు. అలాగే ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కూడా ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 67వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా అతడిని కళాశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు.

సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి, తదితరులు

ఆత్మకూరు (ఎస్) : సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జన్ను సార్) పాటల సీడీని గురువారం ఆత్మకూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యుడు డాక్టర్ కొప్పుల రంగారెడ్డి మాట్లాడారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేపట్టిన వ్యక్తి జన్ను అన్నారు. పేదలు జన్నుసారును మర్చిపోలేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్, న్యాయవాది లింగంపల్లి భద్రయ్య, భాషపంగు భాస్కర్, లింగంపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నూతనకల్ : విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిర్యాలలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చలింగంటి మల్లయ్య తన వ్యవసాయ పొలంలో పశువులను మేపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ వైర్ ఎద్దుకు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 60వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత



తిరుమలగిరిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారి మల్లెల వందన

తిరుమలగిరి : ఉధృత నీళ్ల విరేచనాల పక్షోత్సవాల సందర్భంగా వైద్యాధికారిని మల్లెల వందన గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురంలో చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ పక్షోత్సవాలు ఈ నెల 15 నుంచి పదిహేను రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి ఈ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, స్వరూప కుమారి, లలిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలి

మద్దిరాల : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేగవంతం చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు తరుగు పేరుతో కోతపెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కాంటాలు వేగవంతం చేసి లారీల కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, పులిగిల లింగన్న, రమేష్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నకు సన్మానం



సూర్యాపేటలో చెవిటి వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

నాగారం : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చెవిటి వెంకన్న యాదవ్‌ను గురువారం నాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యాపేటలో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ యానాల ఇంద్రసేనారెడ్డి, పసుపులేటి వెంకట్‌రెడ్డి, ఎల్మకంటి సోమయ్య, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో పూజలు, అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగి షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చనలు, మధ్యాహ్న హారతి నిర్వహించారు. అనంతరం దాతలు పర్సాయపల్లి మాజీ సర్పంచ్ కొప్పుల భరత్‌రెడ్డి –అంగన్‌వాడీ టీచర్ ప్రభావతి దంపతులు 200మందికి అన్నదానం చేశారు. అలాగే సాయంత్రం సాయంత్ర హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర అర్చకుడు కందవల్లి సాయిరాం, ఉపాధిహామీ ఏపీఓ సీహెచ్.ఉపేందర్, సీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బలి సుధీర్‌రెడ్డి, ఈసీ నగేష్, సంతోష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

స్వేరో విక్టరీ డే



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో గురువారం స్వేరో విక్టరీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులచే గ్రామంలో స్వేరో పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. జూన్ 10 వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య తెలిపారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ర్యాంకులు సాధించిన వారిని సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీపీఎల్ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. ఈ మేరకు గురువారం అర్వపల్లిలో బీసీ సంఘం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీలకు మూడు అసెంబ్లీ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీసీలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. బీసీల్లోని కులాలన్నీ సంఘటితమై ఐక్య ఉద్యమాలు చేసి అసెంబ్లీపై బీసీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుండెబోయిన ఆంజనేయులు, కనుకు నాగరాజు, బ్రహ్మం, కనకు మహేష్, మేడిపల్లి వేణు, సతీష్, ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకునేందుకు తప్పుడు ప్రచారం

అర్వపల్లి : రాజకీయ లబ్ధికోసమే ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌పై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని బీఆర్ఎస్ యూత్ మండల నాయకుడు బందెల శశికాంత్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గానికి కిశోర్ ఎమ్మెల్యే అయ్యాకే గత 50 ఏళ్లుగా జరగని అభివృద్ధి కేవలం 10 ఏళ్లలో జరిగిందని చెప్పారు. నియోజకవర్గంలో ఉనికిని కాపాడుకునేందుకు అఖిలపక్ష నాయకులు ఎమ్మెల్యేపై లేనిపోని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా హన్మంతు



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సంకినేని

తిరుమలగిరి : భారతీయ జనతా పార్టీ తిరుమలగిరి పట్టణ అధ్యక్షుడిగా 2వ వార్డుకు చెందిన చిర్రబోయిన హన్మంతును నియమించినట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేటలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వారిని నియమించారు. తిరుమలగిరి పట్టణానికి చెందిన మూల వెంకట్‌రెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య పాల్గొన్నారు.

పొడి చెత్త కొనుగోలు కేంద్రం ప్రారంభం



పొడి చెత్త కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పావని, తదితరులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్న పొడి చెత్త కొనుగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని 45వ వార్డులో పొడి చెత్త కొనుగోలు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గృహ, వ్యాపార యజమానులు పొడి చెత్తను భద్రపరచుకొని వారంలో ఒకరోజు సెంటర్లో విక్రయించాలన్నారు. ఈ పొడి చెత్త కిలోకు ఐదు రూపాయల చొప్పున నగదు పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

అర్వపల్లి : అర్వపల్లిలోని చైతన్యభారతి విద్యామందిర్ పాఠశాల 1999–2000 పదవ తరగతి పూర్వ విద్యార్థులు గురువారం అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు కేసగాని మహేష్, కుంభం సోమయ్య, కె.చంద్రశేఖర్, పి.రామ్మూర్తి, డి.శ్రీనివాస్, కె.రంగయ్య, ఎ.శ్రీనివాస్, ఎ.యాదగిరి, పూర్వవిద్యార్థులు కనుకు సరిత, రావుల సైదులు, భూతం సైదులు, బిక్కినేటి సైదులు, ఆమనగంటి వెంకన్న పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జలగం జనార్దన్



సభలో మాట్లాడుతున్న మధన్న

ఆత్మకూర్ (ఎస్) : ఎన్నో అనారోగ్య సమస్యలు ఉన్నా ప్రతి క్షణం ప్రజల కోసం పరితపించిన పేదల పక్షపాతి, ప్రజానాయకుడు జలగం జనార్దన్(జన్ను) అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధన్న అన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జన్ను 2వ వర్ధంతి సభను గురువారం మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధన్న మాట్లాడారు. 40 సంవత్సరాలు తాను నమ్మిన సిద్ధాంతం కోసం పేదల పక్షాన పోరాడిన ప్రజా నాయకుడు జనార్దన్ అన్నారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జన్ను స్మారక గ్రంథాలయాన్ని ఆయన భార్య కళమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మందారి డేవిడ్‌కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, ఆర్ జనార్దన్, కాకి భాస్కర్, ధర్మార్జున్, గంట నాగయ్య, ఇందూరి సాగర్, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, కారింగుల వెంకన్న, వీరబోయిన ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి



నూతనకల్ : వెంకెపల్లిలో వననర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సాంబిరెడ్డి

నూతనకల్ : మొక్కల సంరక్షణలో వన నర్సరీల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని డీఎల్‌పీఓ సాంబిరెడ్డి అన్నారు. గురువారం నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల, వెంకెపల్లి గ్రామాల్లో వన నర్సరీ కేంద్రాలను, సెగ్రిగేషన్ షెడ్లను, గ్రామాల్లోని వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వన నర్సరీల్లో మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడి చెత్తలను వేరు చేసి కంపోస్టు ఎరువుల తయారీకి చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొంపెల్లి రాంరెడ్డి, మాతంగి సోమనర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి బాణాల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వననర్సరీల్లో మొక్కలు పెంచాలి..

సూర్యాపేట రూరల్ : హరితహారంలో మొక్కలు నాటేందుకు గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో మొక్కలను పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. గురువారం కేసారం గ్రామంలోని నర్సరీని పరిశీలించి మాట్లాడారు. నర్సరీల్లో మొక్కలకు ప్రతి రోజు నీళ్లు పోయాలని, మొక్కలు చనిపోకుండా కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



తిరుమలగిరిలో పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో పారిశుద్ధ్య వారోత్సవాల సందర్భంగా మున్సిపల్ సిబ్బంది గురువారం పిచ్చి మొక్కలు తొలగించారు. మురుగు కాల్వల్లో ఉన్న మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఎర్ర సోమయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు వచ్చేశాయ్..

- తుంగతుర్తి నియోజకవర్గంలో 11 కేంద్రాల ద్వారా పంపిణీ
- 30 కిలోల బస్తా రూ.843
- రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



తిమ్మాపురం పీఏసీఎస్‌లో జీలుగ బస్తాలు

అర్వపల్లి : యాసంగి పూర్తి కావస్తుంది. ధాన్యం కొనుగోళ్లు కూడా తుదిదశకు చేరాయి. దీంతో రైతులు వానాకాలం సాగుపై దృష్టి సారిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా పచ్చిరొట్ట అయిన జీలుగ విత్తనాలు దుక్కిలో వేసి దున్నితే భూసారం పెరుగుతుంది. ఇందుకు అవసరమైన విత్తనాలను ఏటా వానాకాలం సాగుకు ముందు రైతులకు ప్రభుత్వం అందజేస్తుంది. రోజురోజుకు రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోతుంది. దీని వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా దిగుబడి కూడా ఆశించిన మేర రావడంలేదు. అయితే కనీసం దుక్కిలోనైనా పచ్చిరొట్ట ఎరువులు వేస్తే కొంతవరకు భూసారం పెరిగే అవకాశం ఉంది. దీని కోసం ప్రభుత్వం జీలుగ విత్తనాలను 65 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తుంది. అయితే 30 కిలోల బస్తా సుమారు రూ.843 చొప్పున ఇస్తున్నారు.

11 కేంద్రాల ద్వారా..

తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నాగారం మండలాల్లోని పీఏసీఎస్, రైతు ఆగ్రోసేవ దుకాణాలకు సంబంధించి 11 కేంద్రాల ద్వారా జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే కొన్ని కేంద్రాలకు మొదటి విడతగా 200 బస్తాల చొప్పున జీలుగ విత్తనాలు వచ్చేశాయి. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డులను తీసుకొని వెళ్లి విత్తనాలను తీసుకోవాల్సి ఉంటుంది.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

తుంగతుర్తి : తుంగతుర్తిలోని రైతు సేవా సహకారం సంఘంలో రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటిసైదులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్‌లో 233 బస్తాల జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, 30కేజీల జీలుగ విత్తనాల బ్యాగ్ ధర రూ.843గా ఉన్నట్లు తెలిపారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌లతో పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు సీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



65 శాతం సబ్సిడీపై అందించే జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తొలకరి ప్రారంభంలోనే వీటిని విత్తితే ఎక్కువ దిగుబడి వస్తుంది. అలాగే భూసారం పెరుగుతుంది. మండలంలో ఈ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే మరిన్ని విత్తనాలను తెప్పిస్తాం.

– ఆర్ శశిధర్‌రెడ్డి, ఏఓ, జాజిరెడ్డిగూడెం

కంటి వెలుగు వైద్యశిబిరం ప్రారంభం



అర్వపల్లి : బొల్లంపల్లిలో కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక



తిరుమలగిరి : తాటిపాములలో కంటి వెలుగు శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. బొల్లంపల్లి గ్రామంలో గురువారం కంటి వెలుగు ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దానం సుజాతయాదగిరి, ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య, డాక్టర్ అఫ్రీన్, రోజారాణి, కాటబత్తిని లక్ష్మీనర్సయ్య, అంగన్‌వాడీ టీచర్ పద్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరం

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో 2వ విడత కంటి వెలుగు శిబిరం పూర్తయిందని మండల వైద్యాధికారిని మల్లెల వందన తెలిపారు. గురువారం తాటిపాముల గ్రామంలో ఆమె మాట్లాడారు. తిరుమలగిరి మండలంలో రెండు టీమ్‌లు ఏర్పాటు చేశామని, 16 గ్రామ పంచాయతీలందు 81 రోజులు, మున్సిపాలిటీ పరిధిలో 69 రోజులు క్యాంపు నిర్వహించి 19,024 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 5335 మందికి అద్దాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్, పల్లె దవాఖాన డాక్టర్ సమతారాణి, స్వరూపాకుమారి, లలిత, సరిత, ఎల్లేష్, సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మినీ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

పెన్‌పహాడ్ : వినియోగదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినీ బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవాలని చీదెళ్ల ఎస్‌బీఐ మేనేజర్ శ్రీధర్ అన్నారు. ఎస్‌బీఐ చీదెళ్ల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మినీబ్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న చిన్నలావాదేవీలు నిర్వహించుకునే వినియోగదారులు దూరప్రాంతాలకు వెళ్లకుండా మినీ బ్యాంక్ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, ప్రేమ్‌చంద్, మినీ బ్యాంక్ నిర్వాహకులు, పేరూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా పెద్ద మైసమ్మ పండుగ



వర్ధమానుకోటలో పెద్దమైసమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నాగారం : నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలోని ఎస్సీ కాలనీలో పెద్ద మైసమ్మ పండుగను భక్తులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ–2 వడ్డే పరశురాములు, ఉపసర్పంచ్ ఈదుల కిరణ్, అరుణ్, యాదగిరి, రమేష్, వెంకన్న, అనిల్, రంజిత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తెగిపడిన లిఫ్టు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట పట్టణంలోని ఓ ఆస్పత్రిలో లిఫ్ట్ తెగిపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన దేశరాజు నర్సమ్మ అనారోగ్యంతో సూర్యాపేటలోని సిగ్మా న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరింది. గురువారం రాత్రి 9గంటల సమయంలో నర్సమ్మకు సిటీ స్కానింగ్ చేసి ఆస్పత్రి రెండో అంతస్తుకు తీసుకు వెళ్తుండగా ఒక్కసారిగా లిఫ్ట్ తెగిపడింది. దీంతో నర్సమ్మతో పాటు లిఫ్టులో ఉన్న సత్యనారాయణ అనే మరో వ్యక్తి తలకు, కాళ్లకు, నడుముకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. కాగా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆస్పత్రి నిర్వహిస్తున్నారని, ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను తరలించేందుకు చుట్టూ ఖాళీప్రదేశం లేదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి లిఫ్టులో సెక్యూరిటీ గార్డు లేరని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అర్వపల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కొప్పుల భరత్‌రెడ్డి కోరారు. గురువారం పర్సాయపల్లిలో జరిగిన బూత్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. కిశోర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గ్రామ ఇన్‌చార్జ్ పందిరి యుగేంధర్, సర్పంచ్ పుప్పాల శేఖర్, ఎంపీటీసీ గీతాసురేష్, మండల కోఆర్డినేటర్ ఎర్ర నర్సయ్య, మిర్యాల వెంకన్న, తొట్టి లింగయ్య, తోట నర్సయ్య, శ్రీను, లింగస్వామి, శ్రీశైలం, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఆలయానికి సామగ్రి బహూకరణ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి, దుర్గామహేశ్వర నూతన దేవాలయానికి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి సతీమణి శోభారాణిలు 10కేజీల ఇత్తడి గంట, నాగపాణి, జలధార, హారతి వస్తువులను దేవాలయ నిర్మాణ కర్త, సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన దేవాలయానికి దాతలు పలు రకాల వస్తువులు విరాళంగా అందించడం అభినందనీయమన్నారు.